## చిన్నకథ

# రిక్షావాలా

-పినిశెట్టి శ్రీనివాసరావు

శ్యామలానగర్ రైతు బజారు.

సమయం మధ్యాహ్నం పన్నెండయినా... జనం నిండుగానే ఉన్నారు.

తాజా ఆకు కూరలు-కాయగూరలు-పండ్లు... కాస్త ఓపిగ్గా ఏరుకుంటే, నాణ్యమైన సరుకు-సరసమైన ధరలకే కొనుక్కోవచ్చు. అటు రైతులకు, ఇటు వినియోగదారులకు లాభం చేకూరేలా ఏర్పాటు చేసిన ఈ రైతు బజార్లు...నిజంగా ఒక మంచి ఆలోచన.

రైతు బజారు ప్రాంగణమంతా, జన సందోహంతో కళకళలాడుతుంటే, బయట ప్రహరీగోడ పొడవునా సైకిళ్లు-స్కూటర్లు. ఓ అరడజను కార్లు బార్లు తీరాయి. ఇంకా పండ్లు అమ్ముకునేవాళ్ల తోపుడు బండ్లు రైతు బజారు పక్కనున్న రోడ్డును ఆక్రమించేశాయి. బియ్యం అమ్మే దుకాణం ముందు..చేతుల్లో పొడవాటి సంచులతో, ఆడ-మగ పెద్ద క్యూలు కట్టేశారు.

నా రెండు చేతుల్లోనూ...మొత్తం ఐదారు కేజీల బరువున్న కాయగూరల సంచులతో...రైతు బజారు బయటకు వచ్చేసరికి, ఓ రిక్షా అతను...వయస్సు అరవై పైనే ఉండొచ్చు. మనిషి మక్కపల్చగా...నీరసంగా, ముడతలు పడిన శరీరంతో...రి



క్షాలో కూర్చునే...''రిక్షా కావాలా బాబయ్య'' అనడిగాడు.

ఇంకా ఈ రోజుల్లో రిక్షాలున్నాయా...అనుకొని, ''వద్దయ్యా...నా స్కూటర్ ఉంది'' అని, స్కూటర్ పార్క్ చేసిన వైపు నడక సాగించాను. కాయగూరలు సంచులు స్కూటర్‌కు తగిలించి, స్కూటర్ స్టార్ట్ చేసి....రిక్షా అతని దగ్గరకు వచ్చి ఆగాను.

''అవును తాతా...ఈ వయస్సులో రిక్షా తొక్కకపోతేనేం... ఇల్లు గడవదా? పిల్లలెవరూ లేరా నిన్ను చూసేందుకు?'' అనడిగాను.

''నలభై ఏళ్లుగా రిక్షా లాగుతున్నాను బాబయ్య...వయస్సు మళ్లిన మాట వాస్తవమేకాని... ఇంటికాడ కూసుంటే ఏం తోసుద్ది? పిక్కల్లో శక్తి ఉన్నంత వరకూ రిక్షా కట్తాను. చుట్ట-బీడి ఖర్చులకైనా వస్తది. పొద్దున్నే చద్దన్నం తినేసొస్తాను. బేరం దొరికి ఇరవయ్యో...పాతికో వస్తే...టిఫిన్ తిని, టీ తాగుతాను. లేదంటే పస్తే. సాయంత్రం పెందళకాడే ఓ రెండు రొట్టెలు, ఇంత కూర తిన్నానంటే...చాలు ఇంకేం కావాల? కొడుకు ఆటో నడుపుతాడు. కోడలు కొంచెం గడుసుది. నాతో అస్సలు మాట్లాడదు. ఎప్పుడైనా మాట్లాడినా గయ్యిమంటుంది. చీకటి పడగానే...పెట్టింది తిని, లేచి వచ్చేస్తాను. ఇల్లు నాదే, రెండే గదులు. నేను నిద్రపోయాక వస్తాడు నా కొడుకు. ఆడు నిద్రలేచేసరికి నేను రిక్షా ఎక్కేస్తాను. మేమిద్దరం కలుసుకునేది తక్కువ. కోడలంటే కొడుక్కీ భయమే. ఏదో ఇలా గడిచిపోతే చాలు. ఈ విషయంలో మా ముసిల్ది అదృష్టవంతురాలు...నాకంటే ముందే పోయింది....ఈ నా సోదంతా నీకెందుకులే బాబయ్య'' అంటూ ఒక్కసారిగా సైలెన్సయిపోయాడు.

వయస్సు మళ్లినా...కష్టపడి సంపాదించాలి అనేతత్వం ఉన్న రిక్షా అతన్ని చూస్తే... నాకు జాలేసింది. గౌరవం కలిగింది. ఏ మనిషైనా స్వతంత్రంగా జీవించాలనే తత్వం కలిగి ఉండాలి. వయస్సుతో నిమిత్తం లేకుండా కాలు, చెయ్యి ఆడుతున్నంత కాలం శారీరక శ్రమ నిరంతరం చేస్తూనే ఉండాలి. అప్పుడే మనిషి యాక్టివ్‌గా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటాడు. అది లేని వాడు అనారోగ్యం పాలుకాక తప్పదు. వయస్సు పైబడగానే...అంతా అయిపోయిందన్న ఆలోచన రానీకుండా, మనోబలంతో శరీరాన్ని ఉత్తేజపరిచి, ఉత్సాహంగా ఉండాలి.

అసలీరోజుల్లో రిక్షాలెక్కడున్నాయి? అక్కడక్కడా ఉన్నా, అది ఎక్కేవాళ్లు ఎందరు? స్పీడ్ యుగం ఇది. ఆటో రిక్షాలైతే కాస్త రేటు ఎక్కువైనా, 'స్పీడు-కంఫర్టు' రెండూ ఉంటాయి. ఇక 'షేర్ ఆటో'లైతే...సైకిల్ రిక్షా కంటే చౌక-స్పీడుకు స్పీడు...వీటి రాకతో సైకిల్ రిక్షా తొక్కేవాళ్ల బ్రతుకులు వీధిన పడ్డాయి. అయినా తప్పదు. సౌకర్యంతో పాటు వేగం కూడా మిళితమైనప్పుడు, మార్పును స్వాగతించక తప్పదు. మార్పుకు అనుగుణంగా మనుషులు మారక తప్పదు.

జేబులో చెయ్యి పెట్టి....రెండు పదుల నోట్లు తీసి...రిక్షావాల చేతిలో పెట్టి, ''బేరం దొరుకుతుందో లేదో...ఖాళీ కడుపుతో ఎంత సేపని ఉంటావు? ఏదైనా తిను' అన్నాను.

రిక్షావాల నా పట్ల కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

నేనేదో ఘనకార్యం చేశానని కాదు గాని, నాలోనూ కొంచెం మానవత్వం ఉందనిపించి, కించిత్తు గర్వంగా ఫీలయ్యాను.

ఇంటికెళ్లాక మా ఆవిడతోనైనా ఈ విషయం చెప్పి...కొంచెం మెప్పు పొందుదాం అనుకున్నాను కాని...'అసలెందుకిచ్చారంటూ..' ఆవిడ రివర్సు అయితే మొదటికే మోసం అనుకుని ఊరుకొన్నాను.

***

రెండు వారాల తర్వాత మళ్లీరైతు బజారుకెళ్లి... తిరిగి వస్తుంటే, అదే రిక్షావాలా...రిక్షాసీటు మీద కూర్చుని...లంకపొగాకు చుట్ట...దమ్ము పీలుస్తూ, తన్మయత్వంలో ఉన్నాడు. నన్నుచూసి గుర్తుపట్టాడేమోనని, రిక్షా దగ్గరకు వెళ్లి నిలుచున్నా. పోయిన సారి నేను చేసిన సహాయానికి నన్నుపగుర్తించి, మర్యాదపూర్వకంగా లేచి నుంచుని, 'నమస్కారం బాబయ్య' అంటూ నాకు దణ్ణం పెట్టకపోయినా, గౌరవంగా పలకరించకపోతాడా అనుకున్న నాకు నిరాశ. నన్ను గుర్తించినట్లు లేదు. గుప్పుగుప్పుమని అతను...దమ్ములాగి వదులుతున్న పొగాకు పొగ...వాసన భరించలేక దూరంగా వచ్చేశాను.

ఈసారి ఎందుకో అతనికి సాయం చెయ్యాలనిపించలేదు.

*

చిరునామా:
పినిశెట్టి శ్రీనివాసరావు
టి-2, బాలాజి హైట్స్,
షిర్డీ సాయి మార్గ్, జెఎన్ రోడ్,
రాజమండ్రి-533103.